క్లుప్తంగా

21న యూత్ హాస్టల్స్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం

ఉక్కునగరం: యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, ఉక్కునగరం యూనిట్ ఆధ్వర్యంలో 21న యోగా దినోత్సవం నిర్వహించనున్నామని చైర్మన్ పి. సత్యానందం తెలిపారు. ప్రపంచ యోగాదినోత్సవం సందర్భంగా ఆ రోజు ఉదయం 5.30 నుంచి 6.30 వరకు త్రిష్నా మైదానంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో పాల్గొవడానికి ఆసక్తి కలవారు ఈనెల 20 కల్లా తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పాల్గొనేవారు టవల్, వాటర్ బాటిల్ తెచ్చుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వివరాలకు సెల్ నంబర్ 94401 78232ను సంప్రదించాలని కోరారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ



వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న మహాత్మాగాంధీ సేవా సంఘం అధ్యక్షుడు

అగనంపూడి: అంతర్జాతీయ పితృదినోత్సవం సందర్భంగా 79వ వార్డు పాత అగనంపూడికి చెందిన మహాత్మాగాంధీ సేవా సంఘం సారధ్యంలో పంచెలు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్రం కూడలిలో నిర్వహించిన కార్యక్రమంలో సేవా సంఘం అధ్యక్షుడు చిత్తా రామారావు మాట్లాడుతూ తల్లిదండ్రులు దైవ స్వరూపులని, వారిని వృద్ధాప్యంలో చిన్న పిల్లల్లా చూసుకోవాలన్నారు. వారి మనసును నొప్పించకుండా చూసుకోవాలన్నారు. హిందూ సమాజంలో తల్లిదండ్రులకు గౌరవప్రదమైన స్థానం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కరణం పైడిరాజు, డీఎస్‌వీ నరసింగరావు, ముత్యాల అప్పారావు, టి.అప్పారావు, ఎస్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యోగా దినోత్సవం



యోగాలో పాల్గొన్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు

ఉక్కునగరం: స్థానిక సృష్టి వరల్డ్ పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈనెల 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం పాఠశాల ఆవరణలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సంయుక్తంగా యోగా దినోత్సవాన్ని జరుపుకున్నారు. 'వసుధైవ కుటుంబం కొరకు యోగా' థీమ్‌తో జరిగిన కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అకడమిక్ కో ఆర్డినేటర్ డి. కిరణ్, చీఫ్ ప్రిన్సిపాల్ శ్రీధర్‌బాబు, ప్రధానోపాధ్యాయురాలు ఇ.చంద్రిక, వైస్ ప్రిన్సిపాల్ సునయన తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బ్యాడ్మింటన్ పోటీలు



బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలు

విశాఖ స్పోర్ట్స్: ఏయూ వ్యాయామ హాల్‌లో ఆదివారం జరిగిన బ్యాడ్మింటన్ పోటీల్లో పలు స్థానిక జట్లు డబుల్స్ విభాగంలో ఉత్సాహంగా తలపడ్డాయి. ఈ పోటీల్లో సురేష్, మధు జోడి విజేతగా నిలిచింది. రమేష్, జయంత్ జోడి రన్నరప్‌గా, మూర్తి, ప్రసాద్ జోడి సెకండ్ రన్నరప్‌గా నిలవగా.. లోకేష్, సాయి జోడి నాలుగో స్థానంలో నిలిచింది. పోటీల ముగింపు కార్యక్రమానికి ఏయూపీఈ విభాగ సంచాలకుడు విజయ్‌మోహన్ హాజరై విజేతలకు ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడల్లో పాల్గొని రాణించాలని ఆకాంక్షించారు.

సుద్దముక్కల జక్కన్న


- సుద్దముక్కలతో అపురూప చిత్రాలు
- పేపర్ ముక్కలతో కళానైపుణ్యం
- సూక్ష్మ కళలో రాణిస్తున్న పెదగంట్యాడ కుర్రోడు మధు



నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్ సాధించిన సుద్దముక్కల లింక్



సుద్దముక్కతో చెక్కిన ఆకృతి



పెన్సిల్‌తో తయారు చేసిన ఆకృతి



పేపర్ కటింగ్‌తో చేసిన స్పైడర్‌మన్ ముఖం



పేపర్ కటింగ్ ఫ్రేమ్ వర్క్‌లో చిన్నారి చిత్రం



ద్వారపూడి మధును అభినందిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి (ఫైల్)

పెదగంట్యాడ: అగ్గిపుల్ల.. సబ్బు బిళ్ల కాదేదీ కవితకు అనర్హం అన్నాడు మహాకవి శ్రీశ్రీ.. సుద్దముక్క, పెన్సిల్ ముల్లు.. పేపర్ ముక్కలు కావేవీ కళాకృతులకు అనర్హం అంటున్నాడు ద్వారపూడి మధు.. జీవీఎంసీ 74వ వార్డు పరిధిలోని సిద్దేశ్వరానికి చెందిన ద్వారపూడి మధు అనే యువకుడు కళాకృతులు చేయడంలో దిట్టగా మారాడు.. తన అన్నయ్య అశోక్ పెన్సిల్ ముల్లుతో సూక్ష్మ ఆకృతులు తయారు చేసి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నాడు. తన అన్నయ్యను స్ఫూర్తిగా తీసుకున్నాడు మధు. సుద్ద ముక్కలతో కళాకృతులు తయారు చేసి ఔరా అనిపిస్తున్నాడు.. ఇంటర్ నేషనల్ బుక్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నాడు. డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న మధు ఇటీవల కాలంలో కళాకృతులు చేయడంపై ఆసక్తి పెంచుకున్నాడు.. తండ్రి గురునాథరావు కార్పెంటర్.. ఇంట్లో ఆయన చెక్కలతో వివిధ రూపాల్లో వుడ్ వర్క్ చేస్తుండడాన్ని గమనించాడు. తాను కూడా ఏదో ఒకటి సాధించి గుర్తింపు తెచ్చుకోవాలని సంకల్పించాడు.. తన అన్న సూక్ష్మ రూపాలను చూసి తాను కూడా చిన్న చిన్న ఆకృతులు తయారు చేయాలని నిర్ణయించుకున్నాడు. తనలోని ప్రతిభకు పదును పెట్టాడు. ముందుగా సుద్దముక్కలతో రకరకాల ఆకృతులను తీర్చిదిద్దాడు. తాను అనుకున్న రూపాలకు ప్రాణం పోశాడు.. అందరినీ అబ్బుర పరిచాడు. తర్వాత పెన్సిళ్లను ఉపయోగించి చిన్న చిన్న బొమ్మలను రూపొందించడం మొదలు పెట్టారు. ఆపై కాగితం ముక్కలతో పేపర్ వర్క్ తయారు చేయడంపై దృష్టి పెట్టారు. ఇందులో చిన్నారుల ముఖ చిత్రాలను తయారు చేశాడు.. పేపర్‌పై చిత్రాలను గీసి.. వాటిని చిన్న చిన్న ముక్కలుగా చేసి.. ఆపై ఫ్రేమ్‌కు అతికించి ఆహా అనిపిస్తున్నాడు. ఆయన గీసిన చిత్రాల్లో బైక్, యువత ముఖ చిత్రం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దీంతో ఆయనకు ఇంటర్ నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ నుంచి పిలుపువచ్చింది. వీడియో కాల్ చేసి ఏదైనా సూక్ష్మ ఆకృతి తయారు చేయాలని కోరడంతో.. వెంటనే 26 నిమిషాల్లోనే సుద్దముక్కలతో లింక్ తయారు చేసి అబ్బురపరిచాడు.. నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో చోటు సంపాదించుకున్నాడు. అందరి మన్ననలు అందుకున్నాడు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి సైతం ఆ విద్యార్థి ప్రతిభను అభినందించారు.

తరగతులు నిర్వహిస్తా..



నేను నేర్చుకున్న ఈ సూక్ష్మ కళను పలువురికి నేర్పించేందుకు సిద్ధంగా ఉన్నా. ఆసక్తి ఉన్న వారికి తరగతులు నిర్వహిస్తూ ఈ కళాకృతులను చేయడం నేర్పిస్తాను. నా తల్లిదండ్రుల ప్రోత్సాహం.. నా అన్నయ్యలోని కళ కారణంగానే నేను కూడా ఇందులో రాణిస్తున్నాను. భవిష్యత్తులో మరిన్ని కళాఖండాలను రూపుదిద్దడమే నా ముందున్న లక్ష్యం.

–ద్వారపూడి మధు, సిద్దేశ్వరం, పెదగంట్యాడ

టూ వీలర్ మెకానిక్‌లకు అండగా ఉంటాం



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక: నియోజకవర్గంలో టూ వీలర్ మెకానిక్‌లకు అండగా ఉంటామని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. స్థానిక లంకా మైదానంలో ఆదివారం నిర్వహించిన ప్రగతి టూ వీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ 10వ వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. అసోసియేషన్ అర్హత ఉన్న సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున రుణాల మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు. సబ్సిడీతో కూడిన రుణాలను అందించేందుకు కృషి చేస్తానన్నారు. అసోసియేషన్ కార్యకలాపాల కోసం భవన నిర్మాణానికి సహకరిస్తానని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ గాజువాకలో చిన్న సంఘంగా ఏర్పాటైన టూ వీలర్ మెకానిక్ అసోసియేషన్ ఇప్పుడు విస్తరించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో 70వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి చందు, సంఘం నాయకులు అప్పారి విష్ణుమూర్తి, డి.ధర్మ, రామకృష్ణ, కె.మోహనరావు, జుబేర్, రాజారెడ్డి, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు పోరాటం ఆగదు



857వ రోజు దీక్షా శిబిరంలో పాల్గొన్న నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని విరమిస్తూ పార్లమెంట్‌లో ప్రకటన చేసే వరకు ఉక్కు పోరాటం ఆగదని స్టీల్ హెచ్‌ఎంఎస్ యూనియన్ నాయకులు అన్నారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద స్టీల్ హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి జి.గణపతిరెడ్డి, అధ్యక్షులు దొమ్మేటి అప్పారావు ఆధ్వర్యంలో 857వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో సంస్థకు చెందిన పలువురు కార్మికులను పాల్గొన్నారు. కేంద్రంలో పాటు ప్రస్తుత విశాఖ ఉక్కు యాజమాన్యం ప్రైవేటీకరణలో భాగంగా కేంద్రానికి సహకరిస్తూ ప్లాంట్‌ను నష్టాల్లో నడుపుతున్నారని, వీరి ప్రయత్నాలు సాగవని హెచ్చరించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోవాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనక తప్పదన్నారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



విద్యార్థులకు పురస్కారాలను అందజేస్తున్న దృశ్యం

గాజువాక: టెన్త్, ఇంటర్మీడియట్‌లలో ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణులైన పలువురు విద్యార్థులకు గాజువాక వాసవీ సేవా ట్రస్టు ప్రతినిధులు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. వాసవీమాత ఆలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను సత్కరించి నగదు బహుమతులను అందజేశారు. కొత్తకర్ణవాని పాలెంలో ఇటీవల భర్తను కోల్పోయిన నాగలక్ష్మికి ఆర్థిక సహకారం అందజేయడంతోపాటు రెండు నెలలకు సరిపడా కిరాణా సరుకులు, బియ్యం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు కులుకూరి మంగరాజు, కేశారపు శ్రీను రమేష్, నంబూరు జగన్నాథం, గుండా శరత్‌చంద్ర గుప్త, పూసర్ల జగదీష్, కూరా రమేష్, ముత్యాల బాబి, సింగంశెట్టి సతీష్, కేశారపు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణ నూకాంబిక ఆలయ అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి

పెదగంట్యాడ: దయాల్‌నగర్‌లో కొలువైన స్వర్ణ నూకాంబిక అమ్మవారి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి హామీ ఇచ్చారు. ఆలయ ఆవరణలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దయాల్‌నగర్‌లోని సమస్యల పరిష్కరిస్తామన్నారు. యూజీడీ కోసం రోడ్డు మొత్తం తవ్వేశారని, దీంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన సత్వరమే ఆ పనులు పూర్తి చేసేలా చర్యలు చేపడతామన్నారు. అలాగే రోడ్లు, కాలువలు నిర్మిస్తామన్నారు. ఈ సమావేశంలో ఎస్‌వై నాయుడు, సీకు రమణ, ఆలయ కమిటీ ప్రతినిధులు, క్వారీ రోడ్డు పెద్దలు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

గాజువాక: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో స్థానిక శ్రీచైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులను సాధించారు. వివిధ కేటగిరీలలో బి.నాగేంద్ర జశ్వంత్ ఆలిండియా 145వ ర్యాంకు సాధించగా, పి.ఆదిత్య 497వ ర్యాంకు, కె.నందిని 947వ ర్యాంకు, జె.మణికాంత 1,009వ ర్యాంకు, కె.కుసుమ అక్షయ 1,699వ ర్యాంకు, ఎన్.భాగ్యశ్రీ 1,845వ ర్యాంకు, కె.హేమంత్ గణేష్ 1,965వ ర్యాంకు, డి.ఇందు 2,297వ ర్యాంకు, ఎన్.కార్తీక్ 2,310వ ర్యాంకు, ఎస్.తేజశ్రీ 2,590వ ర్యాంకు, డి.ఉదయ్ 2,686వ ర్యాంకు, బి.ప్రణతి 3,237వ ర్యాంకు, ఎస్.అనంత సాయితేజ 3,270వ ర్యాంకు, జి.గణేష్ 3,516వ ర్యాంకు టి.తేజేష్ 3,778వ ర్యాంకు, వి.హేమలత 4,434వ ర్యాంకు, సీహెచ్.రోహిత్ 4,991వ ర్యాంకు, డి.వెంకట చిన్ని కృష్ణ 4,995 ర్యాంకు, ఎస్.దివ్యశ్రీ 5,445 ర్యాంకును సాధించినట్టు కళాశాల ఎగ్జిక్యూటివ్ ఏజీఎం రమణ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వారిని ఎగ్జిక్యూటివ్ డీన్స్ ఎస్.రఘు కుమార్, కె.బంగారు బాబు తదితరులు అభినందించారు. కార్యక్రమంలో డీన్స్ పి.నాగేశ్వరరావు, ఎంవీఎల్ నారాయణ, ఎస్.మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గంగవరం పోర్టు ఉద్యోగులకు న్యాయం చేస్తాం



ఎమ్మెల్యేను కలిసిన గంగవరం పోర్టు ఉద్యోగులు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో పనిచేస్తున్న ఉద్యోగులకు జీతాల విషయంలో పూర్తి స్థాయిలో న్యాయం చేస్తామని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి హామీ ఇచ్చారు. రెండు రోజుల్లో పోర్టు యాజమాన్యంతో పాటు జిల్లా కలెక్టర్‌తో కలసి సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. గంగవరం పోర్టు ఉద్యోగులు తమ సమస్యలపై ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని వైఎస్సార్ సీపీ 64వ వార్డు అధ్యక్షుడు ధర్మాల శ్రీనుతో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారి సమస్యలను ఏకరువు పెట్టారు. తమకు న్యాయం చేయాలని విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే రెండు రోజుల్లో సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

గ్రంథాలయ భవన నిర్మాణానికి వినతి



ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న 75వ వార్డు నాయకులు

పెదగంట్యాడ: పెదగంట్యాడ శాఖా గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరుకుందని, వర్షం పడితే శ్లాబ్ కారిపోయి పుస్తకాలు తడచిపోతున్నాయని వైఎస్సార్ సీపీ 75వ వార్డు నాయకులు తెలిపారు. వెంటనే ఆ భవనాన్ని తొలగించి కొత్తగా నిర్మించాలని కోరారు. ఈ మేరకు గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డికి ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ భవన నిర్మాణానికి గ్రంథాలయ సంస్థ చైర్మన్ రూ.9లక్షలు మంజూరు చేశారని తెలిపారు. ఆ నిధులతో భవన నిర్మాణాన్ని చేపట్టాలని విన్నవించారు. ఆ నిధులు సరిపోకపోతే ఎమ్మెల్యే నిధులు కేటాయించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే నాగిరెడ్డి గ్రంథాలయ భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్టుపూడి పరదేశి, గొందేశి మహేశ్వరరెడ్డి, గొందేశి సత్యారావు, వెంకటేష్, పిట్టా రెడ్డి, పెంటారావు, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ కళలను ఆదరించాలి



కళాకారులకు బహుమతులు అందజేస్తున్న బాలకొండలరావు

డాబాగార్డెన్స్: సంప్రదాయ కళలకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రముఖ నృత్య కళాకారిణి ఏబీ బాలకొండలరావు పేర్కొన్నారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నాట్య పరిమళ మ్యూజికల్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో సంగీతం, నృత్యంపై ఆదివారం నిర్వహించిన నైపుణ్య శిక్షణలో విజేతలుగా నిలిచిన వారికి ఆమె బహుమతులు అందజేశారు. సభాధ్యక్షుడు ఎంవీ రాజశేఖర్ మాట్లాడుతూ భారతీయ సనాతన సాంప్రదాయంలో భాగమైన కళలను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వంకాయల సన్యాసిరాజు సంస్థ ద్వారా కళా రంగానికి సేవలందిస్తున్న లిపికారెడ్డి, డాక్టర్ వై. బాలగణేష్‌ను అభినందించారు. కార్యక్రమంలో చెన్నా తిరుమలరావు, పి. శైలత కృష్ణ, సత్యనారాయణరెడ్డి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విశేషంగా తిరువీధి



తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: అమావాస్య పురస్కరించుకుని సింహగిరిపై ఆదివారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి విశేషంగా తిరువీధి జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను పల్లకీలో అధిష్టంపజేసి సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

జగదీశ్వరరావుకు స్వాగతం పలుకుదాం

ఉక్కునగరం: అంతర్జాతీయ కార్మిక సమాఖ్య జెనీవాలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో భారతదేశ ప్రతినిధిగా పాల్గొని సోమవారం తిరిగి వస్తున్న బీఎంఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం. జగదీశ్వరరావుకు ఘన స్వాగతం పలకడానికి బీఎంఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎయిర్‌పోర్టుకు తరలిరావాలని బీఎంఎస్ నాయకులు కోరారు. ఆదివారం ఉక్కునగరంలో జరిగిన బీఎంఎస్ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ సదస్సులో భారత్‌లోని కార్మికుల సమస్యలను, సోషల్ సెక్యూరిటీపై ఉపన్యసించి కార్మిక వాణిని ప్రపంచ దేశాలకు వినిపించారన్నారు. ఆయనను ఎయిర్‌పోర్టు నుంచి గాజువాక, కూర్మన్నపాలెం మీదుగా ర్యాలీగా తీసుకు రానున్నామన్నారు. కార్యక్రమంలో బీఎంఎస్ జిల్లా అధ్యక్షులు రొక్కం సురేష్‌కుమార్, జిల్లా కార్యదర్శి శరగడం రామ చంద్రశేఖర్, జిల్లా ఇన్‌చార్జ్ లాలం ప్రసాద్, జోనల్ ఇన్‌చార్జ్ రాందాస్ నరేంద్ర, రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎం.ఎస్. నాయుడు, ఉపాధ్యక్షులు చింతా రమణ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి జగన్నాథుని ఉత్సవాలు



జగన్నాథుని దేవాలయం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సెక్టార్–9లో వెలసిన జగన్నాథుని ఉత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్కళ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం ఉత్సవమూర్తులను రథంపై ప్రతిష్ఠించనున్నారు. సాయంత్రం 3.30 నుంచి రథయాత్ర ప్రారంభం కానుంది. 24న హీర పంచమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఈ నెల 28న తిరుగు రథయాత్ర జరగనున్నది. 29న భక్తులకు ఏకాదశి దర్శన్ నిర్వహించనున్నారు. 30వ తేదీ రాత్రి 7 గంటల నుంచి సమారాధనకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 20 నుంచి 30 వరకు ప్రతీ రోజు ఆలయం ఆవరణలో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులతో సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

నేడు డయల్ యువర్ ఆర్డీవో

మహారాణిపేట: విశాఖ రెవెన్యూ డివిజనల్ అధికారి డి.హుస్సేన్ సాహెబ్ సోమవారం డయల్ యువర్ ఆర్‌డీవో కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుంది. గాజువాక, పెదగంట్యాడ, పెందుర్తి, మహారాణిపేట, ములగాడ, గోపాలపట్నం తదితర ప్రాంతాల తహసీల్దార్ల కార్యాలయాల పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం నిమిత్తం ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రజలు 0891–2562977 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యను తెలియజేయాలి.

ఏఐవైఎఫ్ మహాసభలు ప్రారంభం



మహాసభల సందర్భంగా జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

అల్లిపురం: అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) విశాఖ జిల్లా 11వ మహా సభలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సీపీఐ కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.లెనిన్‌బాబు పాల్గొని పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం జరిగిన మహాసభలో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి మోదీ ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న హామీని పక్కన పెట్టి దేశంలో మత విద్వేష రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి మహంకాళీ సుబ్బారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఏడాది జనవరి 1వ తేదీన జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని అమలు చేయలేదన్నారు. ఎస్‌వీ యూనివర్సిటీ మాజీ లెక్చరర్ క్షేత్రపాల్ మాట్లాడుతూ దేశంలోయువత భవిష్యత్తు, ఉద్యోగ, ఉపాధి కోసం ఏఐవైఎఫ్ జెండా చేతపట్టి సమరశీల ఉద్యమాలకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు మధ్యలో ఉన్న స్తంభాల తొలగింపు



ఆటోనగర్ నుంచి తుంగ్లాంకు వచ్చే మార్గంలో ఉన్న విద్యుత్ స్తంభాలు



స్తంభాలు తొలగించిన తరువాత రహదారి

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు ఆటోనగర్ నుంచి తుంగ్లాం వచ్చే రోడ్డులో అవాంతరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించారు. కొద్ది రోజుల నుంచి స్తంభాల తొలగింపు కార్యక్రమంలో సిబ్బంది నిమగ్నమయ్యారు. వార్డు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి సమస్యను గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో సమస్యపై స్పందించారు. సత్వరం అధికారుల చొరవతో సమస్యను పరిష్కరించారు.

రథోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



జగన్నాథస్వామి రథోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడిలో కొలువైన జగన్నాథస్వామి రథోత్సవ పోస్టర్‌ను గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఆవిష్కరించారు. ఈసందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ ఏటా భక్తిశ్రద్ధలతో రథోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని, ఈ ఏడాది కూడా జగన్నాథస్వామి దశావతారాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు కమిటీ ఏర్పాట్లు చేసిందన్నారు. ఆవిష్కరణ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ నాయకులు తిప్పల దేవన్‌రెడ్డి, కమిటీ ప్రతినిధులు జెర్రిపోతుల సోమునాయుడు, గెద్దాడ సత్యవతి, వంతల దేవరాజు, పుచ్చా పైడితల్లి, గళ్లా శ్రీనుబాబు, బోడేం సన్యాసమ్మ, ఈటి జగన్నాథరావు పాల్గొన్నారు.

రథయాత్ర వీక్షణకు బాలలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి



సమీక్ష నిర్వహిస్తున్న బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారామ్

మహారాణిపేట: ఈనెల 20 నుంచి పది రోజుల పాటు జరగనున్న జగన్నాథ రథయాత్రలో పిల్లలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం ఆదేశించారు. ఆదివారం టర్నర్ చౌల్ట్రీ వద్ద గల దేవదాయ శాఖ కార్యాలయ ఆవరణలో దేవదాయ శాఖ, స్త్రీ,శిశు సంక్షేమ శాఖ, 1098 చైల్డ్ లైన్, జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. గత ఏడాది ఉత్సవాల్లో ఎంత మంది బాలలు రథోత్సవాన్ని తిలకించారని దేవాలయ ఈవో రాజగోపాలరెడ్డిని ప్రశ్నించారు. అదే విధంగా వైద్య ఆరోగ్యశాఖ కూడా కిట్లు, పారా మెడికల్ సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. దివ్యాంగ బాలలకు ప్రత్యేక దర్శనం కల్పించేందుకు ట్రై సైకిళ్లతో పాటు ప్రత్యేక దర్శన లైన్లు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. బాలల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి అధికారి, సిబ్బందిపై ఉందన్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ కమిషన్ సూచనల ప్రకారం బాలలకు సేవలందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి రమేష్, చైల్డ్‌లైన్ 1098 జిల్లా కో–ఆర్డినేటర్ డేవిడ్ రాజు, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ అధికారి రమణకుమారి, వైసీపీ నాయకుడు మాసిపోగు రాజు, దేవస్థానం ప్రధాన అర్చకుడు జగన్నాథ ఆచార్యులు, వివిధ సచివాలయాల కార్యదర్శులు, వైద్య, ఆరోగ్య శాఖ, దేవదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.